కథానిక

# రంగమ్మగారి రాచ్చిప్పలు

వజ్ఝల రామనరసింహం

ఓ చేత్తో ప్రయాణం సంచీ, మరొక చేతిలో మూట, పట్టుకొని వీథి మెట్లు ఎక్కేను. గది ద్వారం తలుపు ఒకటిమాత్రం తెరిచివుంది. గదిలో ఎవరూ వున్నట్లు లేదు. పెరటివైపు నుంచి మాత్రం ఏవో మాటలు వినవస్తున్నవి. ...అప్పుడే ట్రెయిను దిగి వస్తూన్న నన్ను ఎవరైనా పలకరించి ఆహ్వానిస్తారనుకుంటున్న నాకు ఆశాభంగంమైందనే చెప్పాలి. ఓ మారు గట్టిగా దగ్గేను. ఎవరూ వినిపించుకున్నట్లు లేదు. సందేహంతో, ద్వారంవద్దకు వచ్చి, గుమ్మానికి అటువైపొక కాలు, ఇటువైపొక కాలు వుంచి నిలుచునిపోయాను, వెళ్ళడమా మానడమా అని తర్కిస్తూ. ఇంతలో, పెరటిలోనుంచి గట్టిగా మాటలు వినిపించసాగేయి. ఒక్క మారు తృళ్ళిపడి అట్లానే యింకా నిల్చుండి వినసాగాను:

"ఓరి శనిగొట్టు వెధవా! ఎప్పుడు వచ్చావురా? ఎట్లా దాపురించావురా, నా పీకల మీదకి! చవట పీనుగా, చచ్చుదద్దమ్మా, ఏబ్రాసి వెధవా, గాడిదా, సమయానికే వచ్చి మీదపడాలిరా? నీ చేతులు విరిగిపోను. నీ కాళ్ళు సొట్టయిపోనూ, నీ బుర్ర బుగ్గెడ."

హరిహరి అనుకొని తెల్ల మొహం వేసి ఒక అడుగు వెనక్కి వేశాను ఎందుకైనా మంచిదని. "కొంపదీసి, ఈ ఘోరమైన దీవనలన్నీ నామీదకి గురిపెట్టబడినవి కావు కదా?" అనే సందేహం అమాంతంగా కలిగింది నాకు! కాని, ఆ మరు నిముషంలోనే నా భయానికి నాకే నవ్వు వచ్చింది. నన్ను యింకా ఎవరూ చూడనిదే నన్నెట్లా తిడతారూ? నేను వచ్చినట్లే యింకా ఎవరికీ తెలియదాయెను! అదీ కాక ఆ గొంతుక మా రంగమ్మత్తయ్యదే. ఆవిడకి నేనంటే అభిమానంకూడాను. నాకు ఆవిడ ఆప్తురాలు. అటువంటప్పుడు ఎంత రోషమురోజులైనా ఇంటికొచ్చిన బంధువుని తిడుతుందా? ఆవిడ నాకెటువంటి బంధువో నాకు సరిగ్గా తెలియదు కాని, చిన్నప్పటినించీ నాకు ఆవిడని "రంగమ్మత్తయ్యా" అని పిలవడమే అలవాటు. పెరటివైపునించి మళ్ళా ఏవో మాటలు వినిపిస్తున్నాయి. వీళ్ళందరూ వీథి తలుపులు తీసేసి, పెరట్లోకే ఏడుస్తూ వున్నట్లుంది.

"వెధవ! నత్తకొయ్యంత వున్నాడో లేడో గాని తెగ మిడిసి పడుతున్నాడు. నా మడి అంతా మంట గలిపేశాడు వెధవ! ఇప్పుడు మళ్ళా ఎట్లా స్నానం చేసేది?"

ఓ! ఇవన్నీ తన మనమడిని తిడుతున్న తిట్లు కాబోలు అనుకుంటూ నేను ధైర్యంగా గదిలోకి వెళ్ళి "నారాయుడూ!" అని పిల్చాను చేతిలో సామాను దించుతూ.

"ఆ! ఎవరదీ? వచ్చాను" అంటూ రంగమ్మత్తయ్య గదిలోకి వచ్చి నన్ను చూచి "ఏవిరోయ్ అబ్బీ! ఎప్పుడు వచ్చావు? రా, కూచో" అని పలకరించింది.

"ఇప్పుడే వస్తున్నాను రంగమ్మత్తయ్యా! విశాఖపట్నం వెళ్తూ, దోవలో యిట్లా దిగా మిమ్మల్నందరినీ చూసిపోదామని. అదీ కాక, మీవూళ్ళో సిలవరి గిన్నెలు చవక అని, రెండు గిన్నెలు కొందామనికూడ వచ్చేను" అన్నాను.

"అట్లా చెప్పురా అబ్బీ! నీకు ఏదో పనుండి వచ్చావు; అంతేకాని, మమ్మల్ని చూద్దామని ప్రత్యేకంగా వస్తావా నువ్వు?"

"ఎంతమాటన్నావు రంగమ్మత్తయ్యా"

"పోనీలే! ఎట్లాగో అట్లాగు, చాలా కాలానికి నిన్ను చూట్టం అయింది లే."

"నారాయుడు లేడూ?"

"నారిగాడా? వాడు మొన్ననే గోకవరం వెళ్ళాడ్రా అబ్బీ. ఏదో పొలం పని వుందిష. రెండు రోజుల్లో వచ్చేస్తాడు."

రంగమ్మత్తయ్య ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా పక్కకి తిరిగి, "ఒరే! గుండూ! ఇలారా

నాయనా. మన అబ్బీ వచ్చాడురా!" అని కేక వేసింది.

గుండుగాడంటే, మా నారాయుడి నాలుగో కొడుకు; మూడేళ్ళవాడు. కేక వేసిన వెంటనే, దుమ్మెరగుండులా మొహం పెట్టుకొని, గదిలోకి వచ్చి, నా వేపు కొరకొరా చూడ్డం మొదలు పెట్టేడు గుండుగాడు. వాడిని చూస్తే, అప్పుడే బుగ్గిలో పది కుస్తీలు పట్టివచ్చినవాడిలా అగుపించాడు. వాడిని ఓమారు పలకరించకపోతే బొత్తిగా బావుండదని, నేను వాడి వేపు చూస్తూ అన్నాను: "ఒరేయ్! ఇట్లా రారా, గుండుగా!"

వాడు నా వేపు ఓమారు పులిలా చూసి, "దొంగ లంజెవెధవా! నేనులాను" అన్నాడు. నేను తెల్లబోయి గడ్డం మీటకరించి వూరుకున్నాను. ఆ వెధవని లెంపకాయ కొడితే బావుండుననిపించింది—అయితే, మరు నిమిషంలో వాడి నడ్డిమీద ఛెళ్లుమని ఒక చపేటాఘాతం పడ్డించింది రంగమ్మత్తయ్య. వాడు మా యిద్దర్నీ తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. వాడి వాటమే అంత.

"గడుగ్గాయి వెధవ! నోరు విప్ప భయం! వెధవతిట్లన్నీ నేర్చుకున్నాడు" అని రంగమ్మత్తయ్య నా వేపు తిరిగి, "రారా అబ్బీ! కాళ్లు కడుక్కొని భోజనానికి లే. చాలా వేళయింది" అన్నది.

భోజనం చేస్తూవుండగా, రంగమ్మత్తయ్య ఏదో కబుర్ల మధ్యలో అన్నది,

"అవుతే ఒరే అబ్బీ, సిలవర్ గిన్నెలు ఎన్ని కొంటావూ?"

"రెండు కొందామనుకుంటున్నాను."

"బజారుకి వెళ్ళేటప్పుడు నాతో చెప్పరా నేను కూడా వస్తాను."

రంగమ్మత్తయ్యకి అరవై ఏళ్లు వచ్చినా కూడా లేవనులేని పూర్వపు మనిషి కాబట్టి దృఢంగానే వుంది. అంచాత, బజార్లన్నీ చుట్టబెట్టి రావడం ఆవిడకొకసరదా. అంతే కాదు, రంగమ్మత్తయ్య బేరం చేసినట్లు ఎవరూ చేయలేరు. అందరూ వీశె వంకాయలు అర్ధరూపాయికి కొంటే, ఆవిడ ఏడణాలకే తేగలదు! ఎంతటి దుకాణదారుడైనా, ఆవిడ పోరు పడలేక కొంచెం తగ్గించే అమ్ముకుంటాడు కాని, తను చెప్పిన ధరకి అమ్మలేడు. ఇంక గిన్నెలు, పాత్రసామానులు మొదలైనవన్నీ మా రంగమ్మత్తయ్యే కొనాలి గాని, మా నారాయుడు యెప్పుడూ కొనడు.

"నీకు కూడా బజారులో ఏమైనా కొనవలసిన అవసరం వుందా ఏమిటి, రంగమ్మత్తయ్యా?" అన్నాను నేను.

"బొత్రా అబ్బీ! చింతకాయపచ్చడి పెట్టుకోడానికి జాగా ఏదీలేదు ఇంట్లో. రెండు బోడి రాచ్చిప్పలు కొనాలని అనుకుంటున్నాను."

పోనీ, బేరసారాల్లో రంగమ్మత్త సాయం దొరికిందికదా అని సంతోషించాను.

సాయంత్రం నాలుగుగంటలకి ఎండ చల్లబడ్డాక, ఇద్దరం బజారుకి వెళ్లేం. మొదట సిలవరి గిన్నెల దుకాణంలో దూరేము. నాకు కావలసిన రెండుగిన్నెలు కనీసం అయిదు రూపాయలైనా అవుతాయనుకున్నాను నేను. కాని, ఏమి టెక్నిక్కు వుపయోగించిందో కాని, మా రంగమ్మత్తయ్య బేరమాడి, పావలా తక్కువ నాలుగురూపాయలకిప్పించింది. అప్పడాల పిండిలా సాగిన ఆ బేరాన్ని ఇక్కడ వివరంగా వ్రాయడం కేవలం దౌర్జన్యం.

అయిదుగంటలు దాటింది. ఆ తర్వాత, రాచ్చిప్పల దుకాణానికి వెళ్లేము. అక్కడ రకరకాల రాచ్చిప్పలు వరుసలో పేర్చబడి వున్నాయి. రంగమ్మత్తయ్య పెద్ద రాచ్చిప్పలున్న వరుస దగ్గరకి వెళ్ళి, ఓ రాచ్చిప్ప తీసి పరిశీలించసాగింది. ఆవిడది నిశితమైన పరిశీలన. రాచ్చిప్ప లోపల, చేత్తో తడిమిచూసింది. తర్వాత రాచ్చిప్ప బోర్లించి, మరోమారు తడిమింది. గోటితో రాచ్చిప్ప అంచుమీద టక్కు టక్కుమని కొట్టి చూసింది. సంతృప్తి అవక మరోమారు కొట్టింది. మరోమారు చేత్తో రాసి చూసింది. తిరగేసింది, మరగేసింది; తిరగేసి మరగేసి, తిరగమరగ వేసి-రోగినాడిని పరీక్షిస్తున్న డాక్టరులా కళ్లుపెట్టి-సందేహంగా చూసింది. ఆ తర్వాత రాచ్చిప్పని నేలమీద పెట్టి సరిగా కుదురుగా నించుందో లేదో చూసింది. బహుశా కొంచెం ఎత్తుపల్లాలుగా కనిపించిందేమో మరి, రాచ్చిప్పని అక్కడినించి తీసి, మరొకచోట

నిలబెట్టి చూసింది. ఆ తర్వాత అరచేతిలో రాచ్చిప్పను వుంచి, ఏమాత్రం బరువు వున్నదీ చూసింది. అది అయాక. రాచ్చిప్పని ముక్కుకి దగ్గిరగా వుంచి ఓమారు వాసన చూసింది! (అవిడ రాచ్చిప్పను నాలికతో తాకి, రుచి చూడలేదని, మాత్రం నేను ప్రమాణపూర్తిగా చెప్పగలను )

ఈ విచిత్రమైన అగ్ని పరీక్షా విధానాన్ని చూస్తూ, నేను, నాతో సహా దుకాణదారుడు (కొందరు కొనుగోలుదార్లు కూడాను!) నోళ్లు తెరిచి నాలికలు బైటపడేసి, మా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ, అట్లానే కొయ్యబొమ్మల్లా నిలుచుండి పోయాం.

"దీని ఖరీదెంతోయ్?" అన్నది రంగమ్మత్త ఆఖరుకి.

"తొమ్మిదణాలవుతుందమ్మా."

"ఏమిష్షీ! రాచ్చిప్ప తొమ్మిదణాలు ఏమి పోయి? సరిగా చెప్పూ. రెండు చిప్పలు తీసుకుంటాను."

"రెండిటిమీదా అణా తగ్గించుకోండి."

రంగమ్మత్త రాచ్చిప్పను కింద వుంచి, "అంత ఖరీదు ఎవడిస్తాడూ; ముండా రాచ్చిప్పకే భాగ్యమా? సరియైన ధర చెప్పూ" అంది.

"మీరెంత యిస్తారో చెప్పండమ్మా మరి."

"సరిగ్గా చెప్పనా? ఇదిగో, ఇట్లా చూడు! అట్టే బేరం చేయడం నాకు తెలియదు—కరకట్టుగా, రాచ్చిప్పకి మూడణాల చొప్పున యిస్తాను! ఇంక నీ యిష్టం!"

దుకాణదారుడు వెటకారంగా చూస్తూ, "ఆ! వుత్తినే రెండు రాచ్చిప్పలూ పటికెళ్ళండమ్మా!" అన్నాడు.

"నా నాయనవిగావూ? వుచితంగా ఇస్తానంటే వద్దంటానా?" అంటూ రంగమ్మత్త రాచ్చిప్పను తీయబోయింది. ఆవిడ నిజంగానే రాచ్చిప్పను వుచితంగా తీసుకువెళ్ళేటట్లుందని దుకాణదారుడు భయపడి, "ఏంవమ్మోయ్! అది ముట్టకండి" అన్నాడు.

"నీ నోరు నొక్కుకుపోనూ! గడియకో మాటా? మరి సరిగ్గా ధర చెప్పూ" అంది రంగమ్మత్తయ్య.

"ఏడణాలనర కంటె తగ్గించలేనమ్మా."

"నాకు రాచ్చిప్పే అక్కరలేదయితే" అని, "ఒరే అబ్బీ! రారా పోదాం" అని నన్ను పిలిచింది రంగమ్మత్త. ఇద్దరం పది గజాలు నడిచాము. ఇంతలో ఆవిడ నన్ను అక్కడే నిలుచుండమని, తను ఒక్కర్తీ దుకాణంవేపు మళ్లీ వెళ్ళి బేరమాడింది. తిరిగి వచ్చేసింది. మళ్ళీ వెళ్ళింది. మళ్ళీ వచ్చేసింది. మళ్ళీ వెళ్ళి, బేరమాడి మళ్ళీ తిరిగి వచ్చేసింది. మళ్ళీ మరోమారు వెళ్ళబోతూ వుండగా. నాకు చికాకువేసి, "రంగమ్మత్తా! నువ్వెంతలా బేరంచేసినా వాడు తక్కువ కిచ్చేటట్లు లేదు. అన్నిమార్లెందుకు తిరుగుతావు?" అన్నాను, రమారమి ఏడుపు మొహంపెట్టి.

"ఒరే అబ్బీ! బేరసారాలు నీకేమీ తెలియవు నువ్వూరుకోరా" అంది ఆవిడ మళ్ళీ దుకాణంవేపు వెళ్తూ.

ఈమారు "పోరు ఘోరంబయ్యెను." బేరం అరగంట సాగేక, ఆవిడ రెండు బోడిరాచ్చిప్పలను నవ్వుతూ తీసుకువచ్చింది.

"ఎంతకిచ్చాడు?" అని అడిగేను.

"ఒక్కొక్కటి ఆరణాల కిచ్చేడు. రెండిటికీ నేను పదకొండణాలన్నరే యిచ్చాను!"

"అదేమిటీ? 12 అణాలవుతుంది కదూ! అర్ధణా తగ్గిస్తే వూరుకొన్నాడా?"

"ఒకటి 6 అణాలయితే, రెండూ 12 అణాలవుతాయని శాస్త్రమా ఏంవిషీ? మీ యిస్కూలు, లెక్కలలా ఏడుస్తాయి. నాదగ్గిర అంతకంటె దమ్మిడీ ఎక్కువలేదని మొరబెట్టుకుంటే వాడే వూరుకున్నాడు వెధవ!

గణిత శాస్త్రాన్నే ప్రాక్టికల్‌గా తారుమారు చేసిన, ఆవిడ శక్తికి ఆశ్చర్యపోయాను. ఒక వస్తువు ఖరీదు ఆరు అణా అయితే, రెండువస్తువుల ఖరీదు పదకొండున్నర అణాలు మాత్రమే అని ఆవిడ రుజువుచేసి చూపించింది!

ఇంటికి వస్తూవుండగా, తోవకడాకూ ఆవిడ రాచ్చిప్పల సౌందర్యాన్ని, వాటి ఉపయోగాలను గురించి వర్ణిస్తూనే వుంది.

రాత్రి భోజనానికి కూచున్నాను. రంగమ్మత్తయ్యే వడ్డిస్తున్నాది.

"రాత్రి పదిగంటల బండికి నేను వెళ్ళాలి" అన్నాను, చింతకాయ పచ్చడి కలుపుకుంటూ.

"అదేంవిషిరా అబ్బీ! మా నారాయుడు వచ్చే వరకూ వుండవుస్రా?"

"లేదత్తయ్యా! కొంచెం పనివుంది."

"సరే లే! వస్తూవుండు."

"తప్పకుండా వత్తా."

భోజనం పూర్తయ్యాక, చేతులు కడుక్కొని గదిలోకి వచ్చాను. నా సంచి సర్దుకుంటూ వుండగా, వంటింట్లోంచి పెద్ద గొల్లు విన వచ్చింది.

"అయ్యయ్యో! ఇక్కడవుంచిన రాచ్చిప్పలు ఏమిషయాయే? ఓసేవ్ కోడలా! నా రాచ్చిప్పలు ఎక్కడ మండిపోయాయేవ్! ఎవరైనా తీశారేమిస్రా? ఇక్కడే వుంచానురోయ్ దేముడా!"

"ఇదిగో టత్తయ్యా! గుండుగాడు తీసి కొట్లో దాచేడు" అని కోడలు గొంతుక విన్పించింది.

"అమ్మయ్యా! గుండెల్లో రాయిపడిపోయింది."

రెండు రాచ్చిప్పలను రెండు చేతుల్తోను పట్టుకొని, రంగమ్మత్తయ్య నేను వున్న గదిలోకి వచ్చి "టైము అయిందిస్రా అబ్బీ, సంచి సర్దుతున్నావుస్?" అన్నది.

"ఔనత్తయ్యా! ఇంక స్టేషనుకి బయలుదేరాలి" అన్నాను సంచి పట్టుకుని.

"అందరం కులాసాగా వున్నామని మీ వాళ్ళందరితోను చెప్పరా అబ్బీ! ఇంక - నా ఆరోగ్యం ఎప్పుడూ ఒక్కలాగే వుందిలే. డాకటేరుని అడిగితే చింతకాయ పచ్చడి తిన కూడదంఛాడు. ఎష్టా చావడం" అంది.

"ఔనత్తయ్యా! ఆరోగ్యం జాగ్రత్త" అని నేను వీధి వరండాలోకివచ్చి, మెట్లు దిగుతూ "ఇంక వస్తానత్తయ్యా" అన్నాను.

నేను రోడ్డుమీద రెండడుగులు వేశానో లేదో, రంగమ్మత్తయ్య అంది "ఒరే అబ్బీ! చెప్పడం మరిచాను - ఈమారు నువ్విక్కడకి వచ్చినప్పుడు, ఈ వూరునించి నీ పెళ్లానికి కూడా రెండు రాచ్చిప్పలు కొనుక్కొని వెళ్ళరా!"

నాకు నవ్వు వచ్చింది: "అట్లాగే వత్తా!" అన్నాను. ఏమైనా, రంగమ్మత్తయ్య అభిమానాన్ని ఎవరూ శంకించలేరు. నేను వెళ్ళిపోతూ వుంటే ఆవిడ యింకా అట్లా నించునేవుంది, నన్ను చూస్తూ. అట్లా నించునివున్న రంగమ్మత్తయ్య చేతుల్లో రాచ్చిప్పలు వున్నాయని వేరే చెప్పాలా?

## భిన్న రూపాలు

"శ్రీరంగ"

నీదాక విశాలాశయం.
నాదొక అమూల్యాదర్శం.
నీకూ నాకూ ఎంతో దూరం,
ఇద్దరి మధ్యన గాలి దుమారం.
అయినా మనిద్దరం ఒకటే.
నీవు హిమాలయానివి,
నేను వింధ్యాచలాన్ని.
నీకొకందుకు గర్వం.
నాకొకందుకు అభిమానం
నీకూ నాకూ ఎంతో దూరం,
ఈ దూరంలో గాలి దుమారం
అయినప్పటికీ మనం ఒక్కటే.
మన ఇద్దరి బ్రతుకులు,
ఎక్కడా కలుసుకోని రైలుబద్దీలు
నీకు నే నెంతదూరమో
నాకూ నీవంతే దూరం.
నీ కెందుకో ఆధిక్యం,
నా కందుకే ప్రాముఖ్యం
మనిద్దరం, భిన్న శరీరులం,
మనిద్దరం భిన్నశక్తులం.
అయితే నేం
నీగమ్యం నాగమ్యం ఒకటే,
నీబ్రతుకూ, నాబ్రతుకూ ఒకటే,
ఇద్దరి వేగం ఒకటే,
కాని, విచిత్రం,
ఎక్కడా మనం మొదలైంది?